మహోత్సవం

ఉద్యోగరీత్యా కేరళ వచ్చింది వర్షిణి. ఆమె పూర్తి పేరు 'అమృత వర్షిణి'. రాగాల మీద మోజుతో ఆ పేరు పెట్టుకున్న తల్లి తండ్రీ ఇద్దరూ అద్భుత సంగీతకారులు. సంగీతం వాళ్లిద్దర్నీ ప్రేమికుల్ని చేసింది. సంగీతం రిలీఫ్ ఇస్తుందని అందరికీ లెక్చర్లు ఇచ్చే వాళ్ళిద్దరూ ఏనాడూ పెళ్లి అయిన తరువాత రిలీఫ్ పొందలేదు. అదీ సంసారమంటే...

"మా ఉత్సవం ఎంత బాగుంటుందో... సెలవలు పెట్టి విదేశాల నుంచి కూడా ఈ ఉత్సవాలకు వస్తారు మావాళ్లంతా..." అని బలవంతపెట్టి త్రిపుణతురాలోని పూర్ణ త్రయేశ్వర ఆలయ ఉత్సవాలకు లాక్కుని వచ్చింది మలయాళీ కొలీగ్.

ఇంత చదువుకున్న అమ్మాయికి ఈ పైత్యం ఏమిటా? అని ఆశ్చర్యపోతూనే ఉత్సవాలకు వచ్చింది వర్షిణి. పూర్ణత్రయేశ్వరుడైన భగవంతుడి ఉత్సవాలు... అదొక మహాద్భుత అనుభవంగా నిలిచిపోయింది వర్షిణి జీవితంలో... గుడి చుట్టూ పాతబడిపోయిన అలనాటి రాజభవనాలు... పాతవైన నల్లటి గోడల మీద అకుపచ్చని నాచు కూడా శోభాయమానంగా అనిపిస్తోంది... అందరి ముఖాలలోనూ అంతులేని ఉత్సాహం.

స్వామి గజోత్సవాన్ని 'శ్రీవేలి' అంటారు... తొమ్మిది ఏనుగులు గొప్పగా రాజసంగా అలంకరించబడ్డాయి... సర్వేశ్వరుడు ఉదారంగు అలంకారాలు ఉన్న ఏనుగు పైన కొలువై ఉన్నాడు... కేవలం తులసి, తామర, మల్లెలు తప్ప మరే అలంకారం ఉండదు. సూర్యభగవానుడు ఆ విరాట్ స్వరూపానికి విస్మృతమైన కిరణార్చన చేస్తున్నాడా అన్నంత అద్భుతంగా... వెలుతురుగా ఉన్నది చుట్టూ...

"ఇవ్వాళ త్రికేట నక్షత్రం... చాలా పవిత్రదినం... ఒకప్పుడు బిల్వమంగళుడు స్వామిని అర్చించడానికి వచ్చాడు... అతడి సూక్ష్మ శరీరానికి స్వామి గుడిలో అనుభవం కాలేదు... అర్థం కాక ఉత్సవంలోకి వచ్చాడు. పధ్నాలుగు ఏనుగుల మీద సర్వేశ్వరుడు చండా ధ్వనికి ఎలతెమ్మి పాదాలతో పరమాద్భుత విరాట్ నృత్యాన్ని చెయ్యడాన్ని దర్శించి పులకించిపోయాడుట బిల్వమంగళుడు..." ఏదో మలయాళ వచనం చెప్పి, అమిత ఉత్సాహంగా అర్థం చెపుతోంది స్నేహితురాలు... ఆశ్చర్యంగా వింటూనే ఆ మూడ్ లోపలికి వెళ్ళిపోయింది వర్షిణి.

ప్రచండమైన చండా ధ్వని... చండా... ఇది కేరళ ఉత్సవాలలోని గొప్ప విస్మృతమైన ఆచారం... విపరీతమైన బరువుతో తబలా లాగా ఉండే ఈ వాయిద్యాన్ని

ఆరోహణ అవరోహణలతో ఒక రకమైన లయతో ప్రయోగించినప్పుడు మెల్లిమెల్లిగా ఆ లయ ఆవహించి మనస్సు అంతర్ముఖమై, సూక్ష్మ శరీరాన్ని కదిలించి, చలింపచేసి, దృష్టిని ఏకోన్ముఖం చేసి, నిద్ర లేపి, అడుగులు వేయిస్తుంది. అంతమంది జనంలో ఉన్నా ఏ మనిషి అనుభవం ఆ మనిషిదే...

శంఖచక్రగదాహస్తాలతో నారాయణమూర్తి దర్శనమిస్తే చండా ధ్వని లయతో ఆ స్వామిని ఛత్రం, చామరం సేవ చేస్తున్నట్లుగా చేతులు ముద్రాభినయం చేస్తున్నారు ఏనుగు మీది అర్చకులు.

అప్రయత్నంగా పెదవులు "నారాయణాయ విద్మహే"... అంటూనే అంటాయి. అడుగులతో, పెదవులతో, అనంతమైన మనస్సుతో... అంతా దివ్యార్చనే!

సరదాగా స్నేహితురాలితో వచ్చిన వర్షిణి ఆ ఉత్సవమాదకతలలో పూర్తిగా మునిగిపోయింది. మళ్ళీ రాత్రికి వచ్చింది స్నేహితురాలితో కలిసి.

ఆ రాత్రి బంగారు బిందెలో 'కానుక' అని భగవంతుడికి 'దక్షిణ' సమర్పిస్తారు. కానుక సమర్పణకు వేంకటేశ్వరస్వామి గుడిలో లాగా పెద్ద క్యూలో నిలబడ్డారు... ఈ ఉత్సవాలలో పాడటమే అదృష్టంగా వస్తారు కళాకారులు. కే. ఎస్. గోపాలకృష్ణన్ మురళీ వాయిద్యం అద్భుతంగా జరుగుతోంది.

కథకళి నృత్యం ఈ మలయాళ దేశపు కళాబిందువు. నిద్ర తూలే కళ్ళతో నేలమీద కూర్చుని, తెల్లవారుఝాము వరకూ 'కథకళి' చూడడం అదొక కొత్త అనుభవం. పూతన మోక్షంలో పూతన వేషం వేసిన అమ్మాయి పరమాద్భుతంగా చేసింది. మేకప్ తీసేసిన తరవాత ఆ అమ్మాయి సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యపోయింది వర్షిణి.

"మనస్పూర్తిగా కళ్ళు మూసుకుని భగవంతుడికి మొక్కుకో... ఈయన సంతాన గోపాలం అంటారు కానీ సర్వం ఇచ్చే సర్వేశ్వరుడు..." అతి వినమ్రంగా తలవంచుకుని కళ్ళు మూసుకుని ప్రార్థిస్తున్న స్నేహితురాలిని చూస్తూ ఆశ్చర్యపోయింది వర్షిణి. ఎంత గొప్ప సంస్కారం వీళ్లది?! ఎంతగా కాపాడుకుంటున్నారో వీళ్ళ సంస్కృతిని!!

విడిగా ఆ అమ్మాయి జీన్స్‌పాంట్‌తో కత్తిరించిన జుట్టుతో చాలా మాటరాఫ్ ఫాక్ట్‌గా ఉంటుంది. ఆ అమ్మాయిలో మలయాళీ జరీ అంచు ముండు సెట్టుతో, గంధం బొట్టుతో మనస్సును అవనతం చెయ్యగల పవిత్రత ఉందన్నమాట!

"దణ్ణం పెట్టుకో..." అదిలించింది ఆ అమ్మాయి.

గభాలున కళ్ళు మూసుకున్నది వర్షిణి... ఏం కోరుకోవాలి?!

గులాబీరంగుల అలంకారాలతో మెరిసిపోతున్నాడు పూర్ణత్రయేశ్వరుడు. ఏమి అందమది?! ఈ అలౌకిక అందం మనుష్యుల్లో వెతుక్కుని ఒంటరిదాన్నైపోయానా? అని ఆలోచిస్తోంది వర్షిణి.

మనస్సు గతంలోకి పారిపోయింది.

❀ ❀ ❀

అతను... అతని పేరు కృష్ణన్ నాయర్... కాలేజీలో సహాధ్యాయి... పేరుకు తగ్గట్లుగా కృష్ణ విగ్రహంలాగా ఉండేవాడు... అతని సన్నిధిలో నిశ్శబ్దం మాట్లాడుతున్నట్లనిపించేది. చామనచాయ, లేత గులాబీరంగు పెదవులు, అనంత పద్మనాభస్వామి వారికి ఉన్న అందమైన పద్మాలలాంటి కళ్లు... ఓహ్... అతని సౌందర్యం, అతని గంభీరత... ఆమె తల్లకిందులుగా అతని ఆకర్షణలో పడిపోయింది...

అతడు ఆమెను చాలా ఆదరించేవాడు.

మధ్యతరగతి కుటుంబాల్లో ఉండే సంఘర్షణ, డబ్బుకు వెతుకులాట, ఫాల్స్ ప్రిస్టేజి... వీటి మధ్య అన్నింటికీ మొండిగా ఉంటేతప్ప బ్రతకలేం అని ఆడపిల్లలు టీనేజ్‌లోనే నిర్ణయాలకు వచ్చేస్తూ ఉంటారు... కానీ ఆమె చెప్పే ప్రతి విషయం వినేవాడతను... ఒప్పుకునేవాడా అంటే కాదు... కానీ... ఆ ఆదరణ... దయగా చూసేవాడు... 'దయ' – పోరాటంలో బ్రతికే ఆడపిల్లను ఈ దయ ఎంత అలరిస్తుందో అర్థమైన వ్యక్తి అతను. అయిదేళ్ళ చదువు తర్వాత కేరళ వెళ్ళిపోయాడతను.

"మన స్నేహం సంగతి?" అని అడిగినప్పుడు... నవ్వేశాడు.

"స్నేహం... అదెక్కడికి పోతుంది?! జీవితాలు కలవడం అంటావా?! అది చాలా కష్టం..." అన్నాడు.

"కారణం?" ఆశ చావక అడిగింది వర్షిణి... పెళ్లంటే మూడు లక్షల ఖర్చు. తండ్రి అప్పులు. తల్లి ఆర్భాటాలు, అత్తవార్ని కొత్త శత్రువులుగా ముందే చిత్రీకరించుకోవడం... ప్రతి విషయానికీ నెగటివ్ ఆలోచనలు... ఈ వాతావరణంలో పెరిగింది వర్షిణి... ఇల్లాంటి అర్థంలేని పెళ్ళి అనే అదుసులో కాలు వెయ్యాలని లేదు...

"నీకు నేను మాత్రం ముఖ్యం... నాకు నా కుటుంబం, బాధ్యతలు, నువ్వు అన్నీ ముఖ్యమే. నా జీవితంలోకి నా బాధ్యతలలోకి నిన్ను లాగడం ప్రేమ కాదు."

"లేదు... లేదు... నేను ఎలాగైనా అడ్జస్టు అవుతాను..." సరిపెట్టుకోవడం అంటే నాకు అసహ్యం అనే వర్షిణి ఆ మాటలు అనాలోచితంగా అనేసింది.

"వర్షిణీ! నీ ప్రత్యేకతలు ఏమిటో తెలుసా నీకు? నీ తెలివి తేటలు, నీ స్వతంత్ర భావాలు – ఈ రెండింటినీ గౌరవించుకోలేని పరిస్థితుల్లోకి నిన్ను తీసుకెళ్ళి, నా కోసరం అడ్జస్ట్ అవవా? అని అడగడం... అది బుద్ధిలేనితనం... మన బాంధవ్యాన్ని కించపరచుకోవడం... సారీ... ఒద్దు... ఇది ప్రస్తుతం జరగని విషయం..." వెళ్ళిపోయాడతను.

వెళ్ళిపోతూ ఆమెలో ఆ రాగరంజితత్వాన్ని ఎత్తుకుపోయాడు. "గుడ్‌బై" అని చెప్పి రైలెక్కిన అతని కళ్లల్లో తడి నిజమా? తన ఊహా?! తనకే తెలియదు.

ఆ తరవాత?!... ఆ తరవాత కచ్చకొద్దీ చాలామందితో స్నేహం చేసింది... ఎక్కడా ఏదో ఓటితనం... ఏదో అసంపూర్తి, ఏమిటి కృష్ణన్‌నాయర్‌లో ఆకర్షణ?! మనస్సుకా? శరీరానికా? మెదడుకా? లేక ఆత్మబంధుత్వమా?!

ఈ గందరగోళంలో చాలా తెలివి తక్కువ పనులు చేసింది వర్షిణి - ఒక పెళ్ళి చేసుకోవడం తప్ప... కారణం?! తనలోని ఒక కోణం ఆమెకు బాగా అర్థమైంది... ఆ మొండితనం... లొంగనితనం... అది ఏ సగటు మొగవాడూ భరించలేడు... ఆడవాళ్ళు సహించలేరు... అందుకే ఆమెకు పరిచయాలు ఎక్కువ, ఆత్మీయులు తక్కువ.

"ఎగ్రసివ్ ఉమెన్ మొగవాడిలో భయం కలగచేస్తుంది. ఈ కొత్త ప్రపంచంలో ఆడదానికి కట్టుబాట్ల భయం లేదు. మొగవాడికి ధర్మం భయం లేదు... అందుకే రిలేషన్‌షిప్స్ చాలా పెళుసుగా ఉంటాయి"... అన్నది ఒక స్నేహితురాలు.

ఇది నిజమా?! ఇది తెలిసే కృష్ణన్‌నాయర్ భయపడ్డాడా?! ఏమో... ఏమైనా తనను తాను దాచుకోవడం తనకు రాదు. కంటి రెప్పలు టపటపా కొట్టుకుంటూ, మాటలు తడబడుతూ, నేల చూపులు చూసుకుంటూ, మనస్సు ఏమి ఆలోచిస్తోందో చచ్చినా మాటలకు అందకుండా బ్రతకడం, మంచి అమ్మాయిలా నటించడం తనకు చచ్చినా రాదు... అల్లాంటి అమ్మాయిలను చూసి 'ఎంత మంచిదిరా ఈ అమ్మాయి పాపం?!' అని అడ్డంగా ఆరాధనలో పడే మొగవాళ్ళలోని పరిపూర్ణమైన అమాయకత్వాన్ని అసలు సహించే ఓర్పులేదు వర్షిణిలో.

ఏదైనా కావచ్చు... ఆమె సగటు మొగవాడికి అర్థం కాని అసంపూర్తి చిత్రం... అతడు తెలివిగలవాడికి మంచి మేధావంతురాలైన స్నేహితురాలు... ఈ రెండింటి మధ్య ప్రియురాలు అయ్యే అవకాశాలు చాలా చాలా తక్కువ.

కానీ, కృష్ణన్‌నాయర్ విషయంలో...

❀ ❀ ❀

"అయిందా ప్రార్థన?! పద పోదాం..." చెయ్యి పట్టుకుని జనంలోకి లాక్కువెళ్ళి పోతోంది స్నేహితురాలు.

ప్రార్థనా? ఏమిటిది? కళ్ళు తెరిచి ఉంటే కనీసం పరిశీలన అన్నా ఉండేది... కళ్ళు మూసుకుని తను చేసింది ఏమిటి?! ఆలోచనల ఉప్పెన... ఉపద్రవం.

ఏనుగుపైన వెలిగిపోతున్న పూర్ణత్రయేశ్వరుణ్ణి చూసింది వర్షిణి... "నాకేం కావాలో నాకంటే నీకే బాగా తెలుసేమో..." అంటూ వెనక్కు వెనక్కు చూసుకుంటూ వెళ్ళిపోయింది వర్షిణి.

❀ ❀ ❀

ఇంటికి రాగానే...

"Interdependence is a higher value than independence" - ఈ కొటేషన్‌తో ఉన్న కార్డ్‌తో పళ్ళ చిట్టి... ఎవరా?! అని ఆశ్చర్యంగా సంతకం చూసింది - కృష్ణన్‌నాయర్!

ఆశ్చర్యపోయింది... ఏం తెలుసు అని ఈ కొటేషన్?! తనను గురించి తెలుసుకుంటూనే ఉన్నాడా?! లేకపోతే ఈ అడ్రస్‌కు ఎలా?! ఫ్రం అడ్రస్

చూసింది... లేదు... కృష్ణన్‌నాయర్... మెల్లిగా, సుతారంగా ఆ అక్షరాలను స్పృశిస్తోంది ఆర్తిగా... చటుక్కున పూర్ణత్రయేశ్వరుడు గుర్తుకు వచ్చాడు.

'థ్యాంక్యూ... థ్యాంక్యూ సోమచ్...' మనస్ఫూర్తిగా అనుకున్నది వర్షిణి... ఆ రోజంతా ఏదో పుస్తకం చదువుతూ... ఆలోచిస్తూనే ఉన్నది వర్షిణి: ఏమిటీ జీవితం?

టి.వి.లో యానిమల్ ప్లానెట్ చూస్తూ ఆలోచిస్తోంది. ఇన్‌స్టింక్ట్స్ మీద బ్రతుకుతున్నామా? సంఘం ఇచ్చిన తర్ఫీదు మీద బ్రతుకుతున్నామా? మామూలు జంతువుకు బాధ్యతగల జంతువుగా ట్రైనింగ్ ఇవ్వచ్చును. కానీ, అది తన తర్ఫీదుకు, దాని ఫలితానికి ఈ రెండింటికీ బాధ్యత వహించదు... వహించకర్లేదు కూడా... కానీ... మనిషి?! అలా కాదు... మనకి మనం కొత్త ప్రోగ్రాం రాసుకోగలం... మన సొంత భావనలకు, సంఘం తర్ఫీదుకు మధ్య ఎన్నో అదుపుల మధ్య, చట్రాల మధ్య, ఆకర్షణల మధ్య, బలవంతపు బాధ్యతల మధ్య మనకు ఏం కావాలో అది నిర్ణయించుకునే శక్తి, స్వతంత్రం మనిషికి ఉన్నాయి.

మరి ఎక్కడ తను ఓడిపోయింది?! ఏ స్నేహమూ ఆమెకు శాశ్వతంగా నిలవదు... ఏ అనుభూతీ అంతర్లీనంగా ఇగిరిపోదు. అన్నీ అలల మీద రాతలే... ఈ కార్పరేట్ ప్రపంచం ఉద్యోగాలలో ముఖ్యంగా రూపాయి రూపాయికి లెఖ్ఖలు వేసే బాల్యం నుంచి ఈ హోదాకు వస్తే డబ్బు, దాని శక్తి అర్థమైతేమటుకు అనుభూతులు, కన్నీళ్ళు వీటి ముఖ్యత్వం... వెనుక పుటల్లోకి వెళ్ళిపోతుంది.

అమ్మ, నాన్న, అక్క చెల్లెళ్ళు, అన్నయ్య పిల్లలు... ఎక్కడికి వెళ్ళినా ఏదో గిఫ్ట్‌తో వెళుతుంది వర్షిణి... ఏదో ఇచ్చి ఏదో కొనుక్కోవాలి. ఏదీ ఊరికే రాదు ఈ ప్రపంచంలో... ప్రేమ, ఆప్యాయత, చుట్టరికాలు, బంధుత్వాలు... అన్నీ అంతేనా?! ఇలా ఆలోచించడం... తనకు తెలుసు... కానీ ఈ పరిధిలో కుంచించుకుపోతోంది. ఎందుకు తనను తను ఇలా కండిషన్ చేసుకుంటోంది?!

ఆ రాత్రి స్నేహితురాలు ఉత్సవానికి రాలేనన్నది... అయినా ఒంటరిగా కారు తీసుకు బయలుదేరింది ఉత్సవానికి. పూర్ణత్రయేశ్వరుడి ఆకర్షణా?.. ఆశా?! ఏమని?!

చండా మ్రోగుతోంది... నటరాజస్వామి డమరుకంలా... దాదాపు పధ్నాలుగు చండాలు, కొమ్ముబూరలు, తప్పెట్లు ఒక్కసారి విజృంభించి, గగనమంతా ఆక్రమిస్తున్నాయా అన్నంత హోరు... కాగడాల వేడి... జనమంతా ఆడ మొగ భేదం లేకుండా చండా ప్రతి ధ్వనికీ అడుగులు వేస్తున్నారు... ఊగిపోతున్నారు పూనకం వచ్చినవారిలా... ఈ ధ్వని... ఈ సంగీతపు లయలు... ఎక్కడో అంతర్లీనంగా ఎక్కడో దాగిన అనుభూతులను ఉద్దీపింపచేసి నిద్రలేపుతున్నాయా?!

ఎందుకో పట్టరాని దుఃఖం వస్తోంది వర్షిణికి... నరాల మధ్య ఒరిపిడి... ఎక్కడెక్కడో గడ్డకట్టిన అనుభూతులు ఒక్కసారిగా సంగీతపు ఉష్ణమాదకతకు కదిలి, ఘనీభవించడం మర్చిపోయి ప్రవహిస్తున్నాయా అన్నట్టుగా ఉన్న వెచ్చదనం... రక్తంలో వేడి... పాతకాలపు గుడి గోడలను ఆనుకుని నిలబడింది వర్షిణి...

విద్యుద్దీపాల అలంకరణతో వెలిగిపోతోంది ఆలయ ప్రాంగణం... చిరు వర్షానికి తడిసిన ఇసుక... ఎవరిదో పాప కాలి అందె... ఇసుకలో సహం కూరుకుపోయి మెరుస్తోంది. దానివంకే చూస్తూ ఆలోచిస్తున్నది వర్షిణి... తీద్దామా? వద్దా? తీసి ఎవరికి ఇవ్వాలి? కొన్ని అనుభూతుల్లా... ఇది ఇసుకలో మాటుబడి ఉండడమే మంచిదేమో!... గుండె బరువెక్కింది... కళ్ళు మూసుకున్నది వర్షిణి... వెచ్చ వెచ్చగా కన్నీళ్ళు... ఎన్నాళ్ళైంది ఇలా... ఇలా... కరిగి...

"బాగున్నదా మా ఉత్సవం?" ఆప్యాయంగా అడుగుతున్నారెవ్వరో. ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది... సన్న జరీ అంచు పంచ, నీలిరంగు షర్ట్... అదే చిరునవ్వు... ఆ కళ్ళల్లో... అదే దయ.

కృష్ణన్ నాయర్!

"అరె... నువ్విక్కడ ఎలా?..." గట్టిగా అరిచినంత పనిచేసింది...

"ష్... ఏమిటా ఎక్సైట్‌మెంట్?" - నవ్వుతూనే మందలించాడతను. అతని కళ్ళు నవ్వుతున్నాయి.

అప్పుడు చూసింది అతని చేతిల్లో రెండేళ్ళ పాపని. పక్కన చాలా అందమైన మలయాళీ అమ్మాయి... చూడగానే ఆకట్టుకునేటంత పెద్ద కళ్ళు. వీపంతా పాకిన లావాటి పొడుగాటి జుట్టు... మలయాళీ అందం.

"వర్షిణి... అమృతవర్షిణి..." పరిచయం చేశాడతను. 'అలాగా' అన్నట్టు చూసింది ఆ అమ్మాయి... చేతులు జోడించింది. వర్షిణి పరీక్షగా చూస్తూ... ఏదో అసూయ... బల్లిలా గుండెల్లో కదిలింది...

"నేనిక్కడున్నానని ఎల్లా తెలుసు?!" అడిగింది వర్షిణి.

"తెలియదు... కానీ కేరళ వచ్చావని తెలుసు..."

"అవును... పొద్దున్న నీ వెల్‌కం ఆర్డు అందింది. అయినా ఎలా తెలుసు?"

"తెలుసుకున్నాను... అంతే." నవ్వేశాడతను.

నాలుగేళ్ళలో ఈ మనిషిలో ఏ మార్పూ రాలేదు... ఏదేదో గబగబా మాట్లాడుతూనే ఆలోచిస్తోంది వర్షిణి. ఓరగా ఆ అమ్మాయినే చూస్తోంది... ఆ పిల్ల మౌనంగా.. అణకువగా... ఈ కేరళలో చాలామంది ఆడపిల్లల్లో ఈ తెచ్చిపెట్టుకున్న మౌనం, అణకువ, కళ్ళతో సంభాషించడం చూసింది వర్షిణి. అక్షరాస్యత ఎక్కువైన ఇక్కడ పని అమ్మాయి కూడా రోజూ పేపరు చదువుతుంది. రాజకీయాలు, స్ట్రైకులు, హక్కులు చాలా తెలుసు వీళ్ళకు... అవేర్‌నెస్ మహా ఎక్కువ... కానీ ప్రవర్తనలో అది కనబడదు... ఎంతో అణకువగా, బారెడు జుట్టుతో, చేతిలో గొడుగుతో చకచకా నడిచివెళ్ళే ఈ అమ్మాయిలలో డబుల్ పిహెచ్. డిలు ఉన్నా ఆశ్చర్యం లేదు... కానీ ఈ అణకువ వెనకాల చాలా స్వేచ్ఛ, శరీరపు కదలికల మధ్యనుంచి ఎప్పుడు బయటపడిపోతుందో అనిపించేటంతటి అనుభూతుల ఉరవడి... ఒత్తిడి...

మాట్లాడడం... ఆలోచించడం... దేనిని దాన్ని విడిగా ఒకేసారి చెయ్యగలగడం కార్పరేట్ ట్రైనింగ్ నేర్పింది వర్షిణికి. ఇది అవలీలగా అర్థమైన అమ్మాయిలు

ఎప్పుడూ ఎవరికీ అర్థం కారు - ఎంత ప్రయత్నం చేసినా...

"ఉండు వర్షిణీ!... వీళ్ళను మావాళ్ళ దగ్గర వదిలేసి వస్తాను" అన్నాడతను.

'వస్తాను' అని కళ్ళతోనే చెప్పి వెళ్ళిపోయింది ఆ అమ్మాయి.

తిరిగి వచ్చాడతను. చేతిలో బూరెలలాంటి తీపి పిండివంటలతో...

"ఇప్పుడు చెప్పు. ఎలా ఉన్నావు?"

ఇసుకలో కూర్చున్నారిద్దరూ గోడనానుకుని.

గులాబీరంగు పంజాబీ డ్రస్సు... తళుక్కుమంటున్న డైమండ్ రింగ్... పరీక్షగా ఆమెనే చూస్తున్నాడతను.

"ఎలా ఉంటాను?! ఇదుగో... ఇలా... నువ్వెలా ఉన్నావు? అయినా నీకు పెళ్ళైతే కనీసం శుభలేఖ పంపించవచ్చుగా... అవునూ... ఆ కొటేషన్ ఏమిటి... "Interdependence is a higher value than independence!" చాలా... చాలా ఆలోచిస్తున్నాను దాన్ని గురించి..." గబగబా మాట్లాడేస్తోంది వర్షిణి... అతని వంక చూస్తూ... మళ్లీ అతను కనబడడేమోనన్నంత ఆర్తిగా చూస్తూ...

ఇసుక గుప్పెట్లో పట్టి జారవిడుస్తోంది. మధ్య మధ్యలో చేతులు దులుపుకుంటోంది. మళ్ళీ ఇసుకలో రాళ్ళన్నీ ఏరి కుప్పలు చేస్తోంది... మళ్ళీ కుదిపివేస్తోంది... మాట్లాడుతూనే ఉన్నది:

అతని కళ్ళల్లో మురిపెం... ఆమె మనస్సులో చిన్న గర్వపురేఖ... ఈ మురిపెం... ఇది కనిపించదేం చాలామంది దగ్గర? ఆడపిల్లను అనుభవించగల వస్తువులాగా చూస్తూ, బహుమతులు ఇచ్చి, డిన్నర్లు ఇచ్చి, బొకేలు ఇచ్చి ఎంత అనుభూతి రాహిత్యం పొందుతున్నాడు పాపం, మొగవాడు!!

"ఊ... చెప్పు... ఏమేమి చేశావు ఇన్ని రోజుల్లో?..." అడిగింది వర్షిణి.

"ఏం చేశానా? చాలా చేశాను... మంచి ఉద్యోగంలో చేరాను. కుటుంబానికి కొన్ని అప్పులు ఉండేవి. తీర్చేశాను. నాన్నగారు రిటైర్ అయ్యే సమయం... అందుకని వాళ్ళకు ఇబ్బంది లేకుండా నెలనెలా కొంత అయివేజు వచ్చే ఏర్పాటు చేశాను... లోను తీసుకుని ఇంటిపైన ఒక పోర్షన్ వేయించి, అమ్మా నాన్నా ఉండే ఏర్పాటు చేశాను... కింద అన్నయ్య, వదిన ఉంటారు... చిన్న కొబ్బరి తోట కొన్నాను... మా అమ్మ పుట్టిన రోజు బహుమతిగా... దానిమీద రాబడి ఆవిడకే... ఇప్పుడు నేను హాయిగా, ఫ్రీగా ఉన్నాను... అదీ కథ."

"సరే... ఈ అక్కౌంట్స్ కాదు నేను అడిగింది..."

"ఈ మలయాళ దేశంలో కట్నాలు లేవు కాబట్టి సరిపోయింది. అదే మా ఆంధ్రాలో అయితే కృష్ణన్‌నాయర్ ఎంత ధర పలికేవాడో..." ఆలోచిస్తూనే అన్నది వర్షిణి.

"ఏం, ఇది అవసరం కాదా... ఇదే నిజం వర్షిణీ!... నేను నా బాధ్యతలను సరిగ్గా చేసి బయటపడితేనే నా ఆలోచనల నుంచి నాకు ఫ్రీడం వస్తుంది... లేకపోతే

అనుభూతులు అలసట తెస్తాయి... ఏదో అపరాధ భావన... గుండె మీద ఒత్తుతూనే ఉంటుంది. నా దృష్టిలో ఇల్లాంటి ఫ్రీడం నిజమైన ఫ్రీడం వర్షిణీ!..."

"అంటే... బాధ్యతలు తప్ప ఇంక జీవితంలో మరేం లేవంటావా?" ఆలోచిస్తూనే అడిగింది:

"అలా కాదు... ఇది ఎవరికి వారు నిర్ణయించుకోవలసిన విషయం వర్షిణీ!... మన జీవితాల్ని మనమే ప్లాను చేసుకోవాలి... లేకపోతే మరొకరు మనకు ప్లానులు గీసి నెత్తిన రుద్దుతారు... అప్పుడు జీవితం అంతా కాంప్రమైజ్... అలా జరక్కూడదు. మన బాధ్యతలు. మన ఆనందాలు – అవి మరొకరి చేతిలోకి జారిపోతున్నాయని బాధపడి ప్రయోజనం లేదు. నా బాధ్యత నీ బాధ్యతే అని భార్యను శాసించి చాలా సంసారాల్లో రొమాన్స్ పోగొట్టుకుంటున్నారు... శాసిస్తే జీవితాలు చెదిరిపోతాయి..."

దిమ్మ తిరిగిపోయింది వర్షిణికి. ఎంత ఆలోచిస్తున్నాడతను?!

"ఊ... సరే... ఇంతకీ మీ అమ్మగారు ఎలా ఉన్నారు?!"

"మా అమ్మా? బాగుంది... అన్నయ్య దగ్గర ఉంది..." అన్నది వర్షిణి.

"ఇంకా ఆవిడ అలా పనిచేస్తూ, అందరి బాధ్యతా చూస్తూ, ఎప్పుడూ నవ్వుతూ... చాలా గొప్ప మనిషి ఆవిడ... ఆవిడ చేసే పులిహోర నేను ఎప్పుడూ మర్చిపోలేను."

నవ్వుకుంది వర్షిణి... గొప్ప మనిషి... ఆ మాటేమిటి? అమ్మ గురించి తనెప్పుడూ అలా అనుకోలేదే!...

"ఏం గొప్ప కనబడింది మా అమ్మలో?..." నవ్వుతూనే అడిగింది.

"అలా అనకు వర్షిణీ!... ఒక్కసారి మీ అమ్మలేని ఆ ఇల్లు ఎలా ఉండేదో ఊహించుకో...మీ అందరి వ్యక్తిత్వాల గొప్పతనాల మధ్య ఒక కాంప్రమైజింగ్ పర్సన్ ఉంది కాబట్టే మీరంతా ఇలా ఉన్నారు."

'నిజమా?' – ఆలోచిస్తోంది వర్షిణి... అమ్మలేని ఆ ఇల్లు – అమ్మో... ఊహించడానికే భయంగా ఉంది.

"రా వర్షిణీ!... పై అంతస్థులో మోహినీ అట్టం చూద్దాం" అన్నాడతను.

ఆ రాత్రి అతణ్ణి ఇంటి దగ్గర దింపి వెళ్ళిపోయింది వర్షిణి. ఆ తరవాత వాళ్ళిద్దరూ చాలాసార్లు కలుసుకున్నారు.

❀ ❀ ❀

"నన్ను ఓల్డ్‌హోంలో చేర్పించవే వర్షిణీ! నేను వదినకు బ్రతుకున్నంత కాలం బాధ్యతగా బ్రతకలేనే..."

అమ్మ పోయిన సెలవులకు వెళితే ఏడ్చింది. అన్నయ్యతో ఆ మాట అంటే...

"ఆవిడ సంగతి తెలిసిందేకదే... ఎంత చేసినా తృప్తి లేదు. ఆ ఓల్డ్‌హోంకు పంపే డబ్బులు నాకు పంపు... వేన్నీళ్ళకు చన్నీళ్ళు సాయం..." అన్నాడు అన్నయ్య.

ఆ మాటలు విని, "ఎలాగో సర్దుకోమ్మా!" అని నెలనెలా అన్నయ్యకే డబ్బులు పంపుతోంది వర్షిణి:

అమ్మను తెచ్చి తన దగ్గర ఉంచుకోవచ్చును. కానీ, ఏ ఒక్క విషయంలోనూ తామిద్దరికీ పడదు... అమ్మ మళ్ళీ ఫోను... శనివారం అతనికి శలవు... ఇంటికి వచ్చాడు... అమ్మ సంగతి కృష్ణతో చెప్పింది.

"వర్షిణీ!... నాకు తెలిసిన మంచి ఓల్డ్‌హోమ్‌లున్నాయి. వెంటనే అమ్మను జాయిన్ చెయ్యి."

"అదికాదు కృష్ణా!"

"ఏదికాదు?! వర్షిణీ! ఈ దేశంలో ఇంట్లో ఉండి అన్నీ అమర్చిపెట్టి అందరి 'మూడ్సు'ను భరించే ఆడవాళ్ళకు జీతం లేదు, రిటైర్‌మెంటు లేదు. పెన్షన్ లేదు. వాళ్ళ పేర్ల మీద ఆస్తులుంటే వాళ్ళకు అనుభవం లేకుండానే మరొక తరానికి వెళ్ళిపోతాయి... పాతిక ఏళ్ళ నువ్వు మరి ఏ మనిషితోనూ అడ్జస్ట్ అవడానికి ఇష్టపడకుండా నీ జీవితాన్ని నువ్వు ఏర్పరుచుకున్నావు... కానీ నలభై ఏళ్ళుగా ఆవిడ మీ అందరి కోసం, మీరు ఇబ్బందిపడకూడదంటూ అందరితోనూ అడ్జస్టు అవుతూవచ్చారు... ప్రతిక్షణం స్వాతంత్ర్యం గురించి మాట్లాడే నీకు అది ఎంత కష్టమో అర్థమవడం లేదా? ఆమెకు ఆర్థిక స్వతంత్రం లేదు కాబట్టే ఆవిడ జీవితాన్ని సెంటిమెంట్లతో కట్టేసి మీరంతా ఆవిడ జీవితం ప్లాను చేస్తున్నారు... అది తప్పు... ఆవిడకు ఏది ఇష్టమో, ఏది కష్టమో మీకు ఎవరికైనా తెలుసా?! ఆవిడకు ఏది కావాలో, ఏది ఒద్దో అని మీరు గౌరవించారా?! నీ గోల్డ్‌ఫిష్‌ఫుడ్‌లో ఎన్ని రకాలున్నాయో నీకు తెలుసు కానీ, మీ అమ్మగారికి ఏ రంగు చీరంటే మనసో నీకు అసలు అయిడియా ఉందా?! ఆలోచించవద్దు వర్షిణీ!... ప్లాన్ చెయ్యి వెంటనే..." నిదానంగానే చెబుతున్నా అతని మాటల్లో పదునున్నది.

"పోనీ, నేను తెచ్చిపెట్టుకుందామంటే..." తన మాటల్లో ఓటితనం, ఆవిడ అక్కర్లేనితనం తనకే అర్థమౌతుంది.

"తప్పులేదు వర్షిణీ!... నీకూ ఆవిడకూ పడదు... మీ వ్యక్తిత్వాల క్లాష్ అది... అలాగే మీ వదినకూ అవ్వచ్చుకదా! నువ్వు పంపే డబ్బు మీ అన్నయ్యకు ఆసరా... నిజమే. కానీ, దీనివల్ల మీ వదినకు ఏమున్నది బాధ్యత?! మీ అమ్మకు ఏం లాభం?!"

నిజమే... తను, అన్నయ్య భరించలేని ఆవిడ వ్యక్తిత్వం వదిన ఎందుకు ఒప్పుకోవాలి? అయినా, తను ఎందుకు ఇలా ఆలోచించలేకపోయింది?! మెంటల్ కండిషనింగ్... అంతే!

"పోనీ... అమ్మకే డబ్బు పంపిద్దామంటే ఆవిడకు అనవసరం. పైగాపిచ్చి ఖర్చులు పెడుతుంది..." తనను తాను సమర్థించుకుంటూనే అన్నది వర్షిణి.

"వర్షిణీ!" హెచ్చరికగా అన్నాడు కృష్ణన్ నాయర్... "మీ నాన్నగారు లెఖ్ఖలు కట్టి డబ్బులు ఇస్తూంటే ఆవిడ అందులో మిగిల్చి, తన సొంత ఖర్చులు మానుకొని మీ ఇద్దరికీ పాకెట్‌మనీ ఇచ్చేవారు. వీళ్ళకు ఎందుకు అని ఆవిడ ఆనాడు ఆలోచించి ఉంటే...?!... ఈనాడు నీ చేతి నిండా డబ్బు ఉంది... అయినా, ఆవిడకు డబ్బు

ఎందుకు అనిపిస్తోందా?! నీ ఇంటి కుక్కపిల్లకు హార్లిక్స్, నీ తోటమాలికి మూడు వేల జీతం... ఇవన్నీ నీ అవసరాలు... కానీ, జీవితంలో అవసరాలు, ప్రయారిటీస్, విలువలు అటూ ఇటూ మారిపోకూడదు వర్షిణీ!... ఆలోచించు..."

బుఱ్ఱ తిరిగిపోయింది వర్షిణికి... ఆవిడ తన తల్లి. కానీ అతను ఎంత ఆలోచిస్తున్నాడు?! ఇతనికి అమ్మ గురించి తెలిసినదాన్లో అన్నయ్యకు అయిదోవంతన్నా తెలుసా?!

"నేను అమ్మను తెచ్చేసుకుంటాను కృష్ణా!" లేచి నిలబడుతూ ఆవేశంగా అన్నది వర్షిణి.

"ఒద్దు... ఇక్కడ నీ ఇల్లు కాపలా, నీ కుక్కల పెంపకం, నీ పనివాళ్ళ అజమాయిషీ, నీ గేటు తాళం, నీ ఎలక్ట్రిసిటీ బిల్లు... ఏదన్నా అతిగా కల్పించుకుంటే నువ్వు కసురుకుంటావు... పట్టించుకోకపోతే బాధ్యత లేదంటావు. ఆవిడను పెనం మీద నుంచి పొయ్యిలోకి వెయ్యకు... అయినా, ఆవిడకు ఈ వయస్సులో కావలసినవి కొత్త బాధ్యతలు కావు... ఆవిడకు వైద్య సౌకర్యం, బాధ్యతతో కూడిన సేవ చేసేవాళ్ళు, బాధ్యత లేని ఆనందం - ఇవి ఇచ్చే ఓల్డ్‌హోం చూద్దాం... సరేనా?..."

అతని వంక ఆరాధనగా చూసింది వర్షిణి... అతను ఆమె వంక చూసి నవ్వాడు... ఆ కళ్ళు దయాపారావతాలు...

❀ ❀ ❀

అతనే వెతికి ఆమె తల్లిని మంచి ఓల్డ్‌హోంలో చేర్పించాడు. అక్కడ ఆవిడ ఎంతో స్వతంత్రంగా, హాయిగా ఉంది. లేసులు అల్లిన టేబిల్ క్లాతు. అగరువత్తులు, దేవుడి మండపం, తెల్లని పక్క, శుభ్రమైన పరిసరాలు... రెండు వారాల్లో ఆవిడకు చాలామంది ఆత్మీయులు... కొంతమంది ఆరాధకులు ఏర్పడ్డారు... చాలారోజుల తరవాత ఆమె గళం విప్పి పాడుతూంటే ఆ చుట్టుపక్కల రాగచైతన్యం...

అమ్మను అంత ఆనందంగా ఎన్నడూ చూడలేదు తాము... ఎప్పుడూ ఆవిడ కళ్ళ కింద నీడలూ, అనవసరమైన విషయాలకు కూడా సరిపెట్టుకోవల్సిరావడం వలన విసుగు, ఎవరూ తన మాట వినరన్న ఉడుకుబోతుతనం... ఇలాగే చూశారు అమ్మను తామంతా...

"హాయిగా ఉన్నాను వర్షిణీ!... ఎవరికీ బరువుకానప్పుడు, మనను ఎవరో బాధ్యత అనుకోనప్పుడు జీవితం చాలా బాగుంటుంది. థ్యాంక్యూ వర్షిణీ!..." తనను దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంటూ అన్నది తల్లి... కన్నీళ్ళు వచ్చాయి వర్షిణికి.

"అతనికి చెప్పమ్మా థ్యాంక్స్!"

తల్లి నవ్వింది అతణ్ణి చూసి హాయిగా...

❀ ❀ ❀

"నిన్నొక విషయం అడుగుదామనుకుంటున్నాను" - అమ్మను చూసి వచ్చే దార్లో అన్నాడతను.

"చెప్పు..."

"ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?! అవసరం అనిపించకా? లేక..."

మాట్లాడలేదు వర్షిణి... 'నీలాంటివాడు మరొకడు దొరక్క...' అని చెప్పలేకపోయింది.

"ఇది నీ జీవితం... నీ కోసరం నేను నిర్ణయాలు తీసుకుని శాసిస్తున్నాననుకోకు. నీకు అభ్యంతరం లేకపోతే మనిద్దరం పెళ్ళి చేసుకుందాం..."

"అదేమిటి? నీకు పెళ్ళైందిగా..." పెద్దగా అరుస్తూ బ్రేక్ వేసింది వర్షిణి. చుట్టూ చిక్కటి అడవి.

"ష్!... ఏమిటా కేకలు?! చెట్లు జడుసుకుంటాయి... నీకు చెప్పానా నా పెళ్ళైందని?..."

"మరి గుళ్ళో ఆవిడ?!"

"ఆమె నా వదిన... ఆ పాప మా అన్నకూతురు..."

"మరి ఇన్నాళ్ళూ నేను ఇలా అనుకుంటూ వుంటే ఎందుకని..." చెవిపట్టుకుని ముద్దుగా తిప్పుతూ అన్నది వర్షిణి.

"నాకు పెళ్ళైందని తెలిస్తే నీ ప్రవర్తన ఎలా ఉంటుందా అనుకున్నాను... మామూలు ఆడపిల్లవి అయివుంటే మన మధ్య స్నేహం చంపేసేదానివి... లేదా, నువ్వు నాకు దక్కనందుకు నేను బాధపడేట్లు చేసేదానివి... కానీ... నువ్వు అమృత వర్షిణివి... నువ్వు నువ్వే..."

మాట్లాడలేదు వర్షిణి - చాలా దూరం వరకూ... కేవలం స్వేచ్ఛ చాలా ఆనందం ఇస్తుందనుకునేది తను... ఎంత అబద్ధం అది?! మరొకరికి ఆనందం ఇచ్చినప్పుడే మన స్వేచ్ఛకు అర్థం తెలుస్తుంది... అతను రాసిన కొటేషన్ ఎంత కరెక్ట్?!

వర్షంలో అందమైన ఆకుపచ్చదనం చలికి తడికి తడుస్తూ ఒణుకుతోంది.

"నీకు పెళ్ళైపోయివుంటే నువ్వొక తియ్యటి జ్ఞాపకానివి. మరి నేనెందుకు చేసుకోలేదంటే... మొదట నా బాధ్యతలు - వాటిని గుర్తించలేకపోతే నేను హాయిగా ఉండలేనని నాకు తెలుసు... మరొక ముఖ్యకారణం మరొక అమృతవర్షిణి నాకు దొరకలేదు కాబట్టి."

గట్టిగా నవ్వింది వర్షిణి... చీకట్లో మెరుపులు... ఉత్సవంలో చూసిన పూర్ణ త్రయేశ్వరుడు గుర్తుకు వచ్చి...

"నీకేమి ఇవ్వాలో నాకు తెలుసు" అన్నట్లు వెలుగుల మధ్య సౌందర్య శృంగార వర్షం కురిపిస్తున్నాడు.

('రచన' జన్మదిన-ఉగాది ప్రత్యేక సంచిక - ఏప్రిల్, 2002)